శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటలు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): వారాంతం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటలకు పైగా సమయం పడుతున్నది. క్యూలైన్లను టీటీడీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

విదేశాల్లో భర్త.. గర్భం దాల్చిన భార్య!

వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డిపై భర్త అనుమానం

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): తాను విదేశాల్లో ఉండగా తన భార్య, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి గర్భం దాల్చిందని ఆమె భర్త మదన్ మోహన్ ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. తన భార్య అక్రమ సంతానానికి తండ్రెవరో తేల్చాలని కోరుతూ కమిషనర్‌కు లేఖ రాశారు. ఆమె గర్భానికి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, గవర్నమెంట్ ప్లీడర్ సుభాష్ కారణమనే అనుమానం వ్యక్తం చేశా రు. కాగా ఇటీవలే ఏపీ శాంతిని దేవాదాయశాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు.

ఏపీలో కొత్త మద్యం పాలసీకి శ్రీకారం

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత మద్యం పాలసీని రద్దు చేస్తున్నట్టు చంద్రబాబు ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేయనున్నది. అన్ని డిస్టలరీస్ లైసెన్సులను రద్దు చేయనున్నట్టు స్పష్టంచేసింది. 3,600 మద్యం దుకాణాలకు టెండర్ విధానంలో లైసెన్సులను కేటాయించనున్నట్టు ప్రకటించింది.

మొహర్రం, బోనాలకు యాంత్రిక ఏనుగు!

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): మొహర్రం, బోనాల ఊరేగింపునకు యాంత్రిక ఏనుగును అందిస్తామని పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్ 'పెటా' రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. దీంతో కర్ణాటక నుంచి సహజ ఏనుగు (రూపవతి)ను తీసుకొచ్చే ప్రక్రియకు తాత్కాలిక బ్రేక్ వేసినట్టు తెలిసింది.

కన్నకొడుకే కాలయముడు

- రియల్టర్ కృష్ణ హత్య కేసును ఛేదించిన షాద్‌నగర్ పోలీసులు
- మూడో భార్యకు ఆస్తులు ఇస్తున్నాడని మొదటి భార్య కొడుకు కోపం
- తండ్రి హత్యకు రూ. 25 లక్షలు, ఓ ఇల్లు సుపారి
- కమ్మరి కృష్ణ కుమారుడు శివతో పాటు మరో ముగ్గురి రిమాండ్
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ రాజేశ్

శనివారం షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయ ఆవరణలో రియల్టర్ కమ్మరి కృష్ణ హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ రాజేశ్

షాద్‌నగర్, జూలై 13: నాలుగు రోజుల క్రితం సంచలనం రేపిన రియల్టర్ కమ్మరి కృష్ణ హత్య కేసును షాద్‌నగర్ పోలీసులు ఛేదించారు. శనివారం షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయ ఆవరణలో శంషాబాద్ డీసీపీ రాజేశ్ కేసు వివరాలను వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం బండ్లగూడ జాగీర్, రఘురాంనగర్ కాలనీకి చెందిన కమ్మరి కృష్ణ (63) రియల్ ఎస్టేట్‌తో పాటు ఇతర వ్యాపారాలు చేసేవారు. మొదటి భార్య, పిల్లలను పట్టించుకోకుండా రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్య అనారోగ్యంతో మృతి చెందగా పావని అనే మహిళను మూడో వివాహం చేసుకొని ఫారూఖ్‌నగర్ మండలం కమ్మదనం రెవెన్యూ పరిధిలోని కేకే ఫామ్ హౌస్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల పావని పేరుమీదు రూ.16 కోట్ల విలువచేసే 10 భవనాలు, హైదరాబాద్‌లోని కేకే గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయమై తండ్రితో మొదటి భార్య కుమారుడు శివ గొడవపడ్డాడు. ఆస్తి మొత్తం మూడో భార్యకు ఇస్తాడని భావించి తండ్రిని హత్య చేసేందుకు పథకం వేశాడు. తండ్రికి బాడీగార్డ్‌గా ఉన్న రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం కాళీమందిర్ డిఫెన్స్ ఎంప్లాయిస్ కాలనీకి చెందిన బీస్కుంద బాబాశివానంద్‌ని కలిశాడు. తన తండ్రిని హత్య చేస్తే రూ.25 లక్షల నగదు, ఓ ఇల్లు సుపారిగా ఇస్తానని చెప్పాడు. దీంతో బాబాశివానంద్ బండ్లగూడ జాగీర్‌కు చెందిన జీలకర్ర గణేశ్, అజయ్‌తోపాటు మరో బాలుడితో కలిసి హత్యకు పథకం వేశారు. ఈ నెల 10న కేకే ఫామ్ హౌస్‌లో ఉన్న కమ్మరి కృష్ణ వద్దకు చేరుకున్నారు. బాడీగార్డ్ కమ్మరి కృష్ణ గొంతు కోయగా, మిగతా ఇద్దరు చేతులు పట్టుకున్నారు. హత్య చేసిన అనంతరం పారిపోయారు. గమనించిన పావని తన భర్తను శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించారు. పావని ఫిర్యాదు మేరకు పోలీసులు కమ్మరి శివ, జీలకర్ర గణేశ్ అలియాస్ లడ్డు అజయ్, బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకొన్నారు. వారి నుంచి రెండు కార్లు, ద్విచక్ర వాహనం, మూడు కత్తులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. తండ్రి ఆస్తిని ఇతరులకు ఇస్తున్నాడనే కోపంతోనే శివ ఈ హత్య చేయించాడని స్పష్టం చేశారు. కేసును ఛేదించిన సీఐలు విజయ్‌కుమార్, రామిరెడ్డి, ప్రమోద్‌కుమార్, పోలీస్ సిబ్బందికి డీసీపీ రివార్డులను అందజేసి అభినందించారు.

ధర్నాలో మాట్లాడుతున్న సొసైటీ నేతలు వెంకటేశ్వర్లు, జీబీ రెడ్డి

మా ప్లాట్లకు రక్షణ కల్పించాలి

- ప్రభుత్వానికి కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ నేతల విజ్ఞప్తి
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు దురాగతాలపై ధర్నా

చిక్కడపల్లి, జూలై 13: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన బావమరిది ఎస్ సత్యనారాయణరావు, వారి గుండాల దౌర్జన్యాల నుంచి తమ ఇండ్ల స్థలాలకు రక్షణ కల్పించాలని కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. భూ బకాసురుడైన ప్రేమ్‌సాగర్‌రావుకు మద్దతు ఇవ్వకుండా తమలాంటి పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఇందిరాపార్కు వద్ద బాధితులు నిర్వహించిన ధర్నాలో సొసైటీ అధ్యక్షుడు వెంటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జీబీ రెడ్డి మాట్లాడుతూ.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా గ్రామ పంచాయతీ అనుమతితో తాము 639/1,643/1,644/1,647/1,648,654 సర్వే నంబర్లలో పట్టాదారుల నుంచి 61 ఎరాల భూమిని కొనుగోలు చేసి, 708 ప్లాట్లుగా విభజించుకున్నామని వివరించారు. వాటిలో కొన్ని ప్లాట్లను తప్పుడు అగ్రిమెంట్లతో ప్రేమ్‌సాగర్‌రావు ఆక్రమించాడని, ఆ ప్లాట్ల చుట్టూ తాము కట్టుకున్న ప్రహరీ గోడలను కూల్చివేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు ఓనర్లను బెదిరించి దాదాపు 150 ప్లాట్లను అతి తక్కువ ధరకే తీసేసుకున్నట్టు తెలిపారు. మిగిలిన 556 మంది ఓనర్లు తమ ప్లాట్లను అమ్మకపోవడంతో ప్రేమ్‌సాగర్‌రావు అక్రమ కేసు పెట్టాడని, తద్వారా ఆ ప్లాట్లలో ఇండ్లు కట్టుకోనీయకుండా ఓనర్లను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. 'ప్రజాదర్బార్'లో అధికారులకు విన్నవించినా ఇప్పటివరకు ఎవరూ స్పందించలేదని తెలిపారు. ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన అనుచరుల దురాగతాలను అడ్డుకుని తమ ప్లాట్లలో ఇండ్లు కట్టుకునేందుకు వీలుకల్పించాలని రాచకొండ పోలీస్ కమిషనర్‌ను కోరారు.

ట్రంప్‌కు మస్క్ భారీ విరాళం

వాషింగ్టన్, జూలై 13: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ భారీ విరాళం అందించారు. ఆయన ట్రంప్‌నకు నేరుగా విరాళం ఇవ్వనప్పటికీ ఆయన తరపున ప్రచారం చేస్తున్న పొలిటికల్ యాక్షన్ కమిటీ (పీఏసీ)కి దానిని అందజేశారు. అయితే ఎంత మొత్తం ఇచ్చినదీ వెల్లడి కాలేదు. అయితే తాము సేకరించే విరాళాల గురించి పీఏసీ సోమవారం ప్రకటించాల్సి ఉంది. దాంతో ఎలాన్ మస్క్ ఎంత ఇచ్చింది ఆ రోజు వెల్లడయ్యే అవకాశం ఉంది. ట్రంప్‌నకు భారీ విరాళం ఇచ్చినప్పటికీ ఈ ఎన్నికల్లో ఎవరి అభ్యర్థిత్వానికి మస్క్ బహిరంగంగా మద్దతు ప్రకటించ లేదు.

మేడిగడ్డకు స్వల్పంగా తగ్గిన వరద

ఇన్‌ఫ్లో 41,200 క్యూసెక్కులు

మహదేవపూర్/కాళేశ్వరం/అయిజ, జూలై 13 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌కు వరద ప్రవాహం కొనసాగుతున్నది. బరాజ్‌కు శుక్రవారం 43,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, శనివారం 41,200 క్యూసెక్కులకు తగ్గింది. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు తెరిచి అంతే మొత్తంలో వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం రివర్‌బెడ్ నుంచి 1.50 మీటర్ల ఎత్తులో వరద ప్రవహిస్తున్నది. కాగా కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం తగ్గుతున్నది. వారం రోజులుగా ప్రాణహిత నదికి వరద పెరిగినా, శనివారం సాయంత్రం వరకు తగ్గడంతో పుష్కరఘాట్ వద్ద 43 వేల క్యూసెక్కుల నుంచి 40 వేల క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం 05.01 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్న గోదావరి లక్ష్మీ బరాజ్ వైపు పరుగులు తీస్తున్నది.

తుంగభద్రకు ఇన్‌ఫ్లో

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలోకి వరద వచ్చి చేరుతున్నది. శనివారం ఇన్‌ఫ్లో 11,400 క్యూసెక్కులు ఉండగా.. అవుట్‌ఫ్లో 210 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాం గరిష్ఠ నీటినిల్వ 105.855 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 30.690 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులకుగాను 1606.21 అడుగులకు చేరినట్టు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

నవరత్న ఆయిల్, గోల్డ్ టర్మరిక్ క్రీమ్ ఔషధాలే

హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): హిమానీ, ఇమామీ కంపెనీలకు చెందిన నవరత్న ఆయిల్, గోల్డ్ టర్మరిక్ ఆయుర్వేదిక్ క్రీమ్ ఔషధ ఉత్పత్తుల క్యాటగిరీలోకే వస్తాయని హైకోర్టు తేల్చిచెప్పింది. వాటితోపాటు బోరోప్లస్ యాంటీ సెప్టిక్ క్రీమ్, బోరో ప్లస్ ప్రిక్లీహీట్ పౌడర్, సోనా చండీ చవన్‌ప్రాశ్ లాంటి ఉత్పత్తులు కూడా ఔషధ ఉత్పత్తుల పరిధిలోకే వస్తాయని స్పష్టం చేసింది. అవి సౌందర్య ఉత్పత్తుల క్యాటగిరీలోకి వస్తాయన్న వాదనను తోసిపుచ్చుతూ.. ఔషధ ఉత్పత్తులపై వసూలు చేసే జీఎస్టీనే వాటికీ వర్తింపజేయాలని జస్టిస్ పీ శ్యాంకోశీ, జస్టిస్ ఎన్ తుకారాంజీ ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. తద్వారా 20 ఏండ్ల నుంచి కొనసాగుతున్న వివాదానికి తెర దించింది.

మైనార్టీ గురుకులాల్లో బదిలీ మార్గదర్శకాలపై స్టే

అమలును 18 వరకు నిలిపివేసిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): మైనారిటీ గురుకులాల్లో బోధన, బోధనేతర సిబ్బంది బదిలీ నిమిత్తం ఈ నెల 6న ఆ శాఖ కార్యదర్శి జారీ చేసిన మార్గదర్శకాల అమలుపై హైకోర్టు స్టే విధించింది. గురుకులాల సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా ఈ మార్గదర్శకాలను జారీ చేశారంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ పుల్లా కార్తీక్ ఇటీవల విచారణ జరిపారు. గురుకులాల సిబ్బందిని తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ సర్వీస్ నిబంధనల పరిధిలోకి తీసుకొస్తూ 2022 జూలై 7న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని పిటిషనర్ల తరపు న్యాయవాది తెలిపారు. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా బదిలీ మార్గదర్శకాలను జారీ చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. దీంతో ఆ మార్గదర్శకాలపై ఈ నెల 18 వరకు స్టే విధిస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు.

మీ కాళ్లు మొక్కుతా.. నా కాళ్లు మొక్కొద్దు!

- కాళ్లకు దండం పెట్టే సంస్కృతిని ప్రజలు, పార్టీ శ్రేణులు వీడాలి
- తల్లిదండ్రులు, గురువులు, దేవుడి కాళ్లకు మాత్రమే దండం పెట్టాలి
- విజయవాడలో ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు తన కాళ్లు మొక్కొద్దని ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు కోరారు. ఎవరైనా తన కాళ్లకు నమస్కరిస్తే తాను కూడా వారి కాళ్లకు నమస్కరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలతో కాళ్లకు నమస్కారం పెట్టించుకొనే సంస్కృతి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు, గురువులు, దేవుడి కాళ్లకు మాత్రమే మొక్కాలని, నాయకులకు కాదని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు కూడా ఈ సంస్కృతికి దూరంగా ఉండాలని సూచించారు. ఏపీ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు శనివారం వచ్చిన చంద్రబాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కొందరు వినతిపత్రాలు సమర్పించి కాళ్లు మొక్కే ప్రయత్నం చేయగా, వారిని వారించారు. వినకుండా కాళ్లకు మొక్కితే.. తాను కూడా వాళ్ల కాళ్లకు మొక్కుతానని తెలిపారు. తన సూచనను, విజ్ఞప్తిని అందరూ అర్థం చేసుకొని సహకరించాలని సీఎం కోరారు.

వాణిజ్య

డీ-మార్ట్ లాభం 774 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 13: డీ-మార్ట్ పేరుతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.773.68 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అమ్మకాలు పెరగడం వల్లనే గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.658.71 కోట్ల లాభంతో పోలిస్తే 17.45 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 18.57 శాతం ఎగబాకి రూ.11,865.44 కోట్ల నుంచి రూ.14,069.14 కోట్లకు చేరుకున్నది. నిర్వహణ ఖర్చులు 18.62 శాతం పెరిగి రూ.13,056.61 కోట్లకు చేరాయి. ఈ సందర్భంగా అవెన్యూ సూపర్‌మార్ట్స్ సీఈవో, ఎండీ నెవిల్లి నోరోన్హా మాట్లాడుతూ..గత త్రైమాసికంలో కొత్తగా ఆరు స్టోర్లను ప్రారంభించడంతో మొత్తం సంఖ్య 371కి చేరుకున్నాయన్నారు.

5.74 లక్షల కోట్లకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, జూలై 13: ప్రత్యక్ష పన్ను వసూళ్లలో రెండంకెల వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 19.54 శాతం పెరిగి రూ.5.74 లక్షల కోట్లు వసూలైనట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) వెల్లడించింది. కార్పొరేట్ సంస్థలు అధికంగా అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులు జరపడం ఇందుకు కారణమని తెలిపింది. అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 27.34 శాతం ఎగబాకి రూ.1.48 లక్షల కోట్లకు చేరాయి. దీంట్లో కార్పొరేషన్ ఆదాయ పన్ను(సీఐటీ) వసూళ్లు 1.14 లక్షల కోట్లు కాగా, వ్యక్తిగత ఆదాయ పన్ను (పీఐటీ) రూ.34,470 కోట్లని పేర్కొంది. ఈ నెల 11 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.5,74,357 కోట్లు కాగా, వీటిలో సీఐటీ రూ.2,10,274 కోట్లు, పీఐటీ రూ.3,46,036 కోట్లని తెలిపింది. అలాగే రూ.70,902 కోట్లను రిఫండ్ రూపంలో చెల్లించింది.

లైఫ్ సైన్సెస్ పాలసీ ఎప్పుడో?

4 నెలలు దాటినా ఊసేలేని కొత్త విధానం

లైఫ్ సైన్సెస్ గ్రిడ్ స్ట్రాటజీపై తీవ్ర నిర్లక్ష్యం

ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు భూముల కొరత

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): దేశ ఔషధ రాజధానిగా హైదరాబాద్‌కు ఉన్న ఖ్యాతి రాష్ట్ర ప్రభుత్వ ఉదాశీనత వల్ల మసకబారే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఫార్మా రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. చేతల్లో మాత్రం ఏమీ చేయలేకపోతున్నది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధం చేసిన ఫార్మాసిటీని రద్దు చేసి, 3 చోట్ల ఫార్మా విలేజ్‌లను నెలకొల్పుతామని రేవంత్ సర్కారు ప్రకటించినప్పటికీ వాటి జాడ ఎక్కడా కానరావడం లేదు. లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రవేశపెడతామని ప్రకటించి 4 నెలలు దాటినా ఇంతవరకు దాని ఊసే లేదు. కనీసం ఆ దిశగా కసరత్తు జరుగుతున్న దాఖలాలు కూడా లేవు. ఈ నెల 5న హైదరాబాద్‌లో ప్రారంభమైన ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో ఈ పాలసీని విడుదల చేస్తారని అందరూ భావించినప్పటికీ నిరాశే ఎదురైంది. ప్రస్తుతం ఆ పాలసీపై మాట్లాడేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్తున్నారు. వాస్తవానికి ఫార్మా రంగంలో హైదరాబాద్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. వాటికి తోడుగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎకోసిస్టంవల్ల పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. అనేక ఆర్‌అండ్‌డీ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ఉజ్వల భవిష్యత్తు ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, రేవంత్ ప్రభుత్వం నుంచి ఈ రంగానికి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం అందడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రిడ్ స్ట్రాటజీపై నిర్లక్ష్యం

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. రానున్న పదేండ్లలో లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టంను 100 బిలియన్ డాలర్ల స్థాయికి పెంచాలని, తద్వారా 4 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా లైఫ్ సైన్సెస్ గ్రిడ్ స్ట్రాటజీని ప్రకటించింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని కూడా నిర్లక్ష్యం చేస్తున్నది. రాష్ట్రంలో 10 గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్.. తొలుత నల్లగొండ, మెదక్, వికారాబాద్‌లో సుమారు 1000 నుంచి 2000 ఎకరాల విస్తీర్ణంలో వీటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇది జరిగి 4 నెలలు దాటినా ఎలాంటి పురోగతి లేదు. క్షేత్రస్థాయిలో మాత్రం భూముల కొరత వెంటాడుతున్నది. నల్లగొండ, మెదక్‌లో భూములు

లేవని కలెక్టర్లు స్పష్టం చేయడంతో వికారాబాద్, జహీరాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ విధానంలో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం హైదరాబాద్ శివార్లలో ఫార్మాసిటీని అభివృద్ధి చేసేందుకు దాదాపు 13 వేల ఎకరాలు సేకరించింది. దీనికి కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు కూడా రావడంతో భూముల కోసం అనేక కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేయడం, కొత్త ఫార్మా విలేజ్‌లు ఇంకా కార్యరూపం దాల్చకపోవడంతో పరిశ్రమ వర్గాలు అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి.

టీ కన్సల్ట్‌ను ప్రారంభిస్తున్న కంపెనీ సీఈవో సందీప్ మక్తల తదితరులు

టీజీఐపీని ప్రారంభించిన టీ కన్సల్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ): తెలుగు స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు అందించడమే లక్ష్యంగా ఏర్పాటైన టీ కన్సల్ట్.. తొలిసారిగా గ్లోబల్ ఇన్వెస్టర్ పూల్‌ను ప్రారంభించింది. ఈ విషయాన్ని కంపెనీ సీఈవో సందీప్ మక్తల తెలిపారు. దుబాయ్ వ్యాపారవేత్త బూ అబ్దుల్లాతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు, తద్వారా మన వ్యాపారాలకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి వీలుంటుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన అబ్దుల్లా కంపెనీతో టీ కన్సల్ట్ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఎంతో మేలు చేయనున్నదని, ముఖ్యంగా ఆవిష్కరణ రంగంలో ప్రత్యేక నైపుణ్యతను కలిగివున్న తెలుగు వారికి అంతర్జాతీయ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ఇది మంచి వేదికని సందీప్ మక్తల తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ -ఎంటీఎన్ఎల్ విలీనం లేనట్టే!



న్యూఢిల్లీ, జూలై 13: ప్రభుత్వరంగ టెలికం సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లను విలీనం చేసే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తున్నది. కేవలం మహానగర్ టెలిఫోన్ నిగం లిమిటెడ్(ఎంటీఎన్ఎల్)కి చెందిన కార్యకలాపాలను బీఎస్ఎన్ఎన్‌కు అప్పగించేయోచనలో సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తున్నది. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు జరుగుతున్నాయని, దీనికి మరో నెల రోజులు సమయం పట్టే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ఎంటీఎన్ఎల్‌ను బీఎస్ఎన్ఎల్‌లో విలీనం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆ వర్గాలు భావిస్తుండటం వల్లనే కార్యకలాపాలు మాత్రమే మార్చాలని యోచిస్తున్నది. తొలుత సెక్రటరీల కమిటీ ఈ ప్రతిపాదనను ఉంచిన తర్వాత క్యాబినెట్ ఆమోదానికి పంపిస్తారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 20న ఎంటీఎన్ఎల్ బాండ్ల ద్వారా సేకరించిన నిధులకు వడ్డీలను చెల్లించాల్సి ఉన్నది. ప్రస్తుతం ఎంటీఎన్ఎల్..ఢిల్లీ, ముంబైలలో మాత్రమే టెలికం సేవలు అందిస్తుండగా, బీఎస్ఎన్ఎల్ మిగతా దేశవ్యాప్తంగా అందిస్తున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎంటీఎన్ఎల్ రూ.3,267.5 కోట్ల నష్టం వచ్చింది.

నయా కార్లు వచ్చేస్తున్నాయ్..

న్యూఢిల్లీ, జూలై 13: కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాలు నయా మాడళ్లను అందుబాటులోకి తీసుకోస్తున్నాయి. ప్రస్తుత నెలలో కూడా సరికొత్త మాడళ్లను ప్రవేశపెట్టబోతున్నాయి. వీటిలో టాటా, నిస్సాన్, హ్యుందాయ్, మెర్సిడెజ్, బీఎండబ్ల్యూ వంటి అరడజన్‌కు పైగా సంస్థలు తమ కొత్త మాడళ్లను విడుదల చేయబోతున్నాయి. దీంట్లో ప్రీమియం సెడాన్, లగ్జరీ హ్యాచ్‌బ్యాక్, పలు ఎస్‌యూవీలతోపాటు ఎలక్ట్రిక్ కార్లు కూడా ఉన్నాయి. వీటి వివరాలు..

టాటా కర్వ్ ఈవీ

టాటా మోటర్స్ ఈవీల పరిధిని మరింత విస్తరించడంలో భాగం మరో మాడల్‌ను విడుదల చేయడానికి రెడీ అయ్యింది. టాటా కర్వ్ ఈవీ పేరుతో విడుదల చేయనున్న ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 500 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. ఈ కారు ధర రూ.20 లక్షల కంటే అధికంగా ఉంటుందని అంచనా. 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్, 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. ఈ మాడల్‌నే ఈ నెల చివర్లో అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నది.

నిస్సాన్ ఎక్స్-ట్రైల్

దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టి దశాబ్ద కాలం పూర్తైన సందర్భంగా నిస్సాన్..ఫోర్త్ జనరేషన్ అవతార్ మాడల్‌ను ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది. ప్రీమియం టచ్ ఇన్‌సైడ్, 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్, అడాస్, 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 8 స్పీడ్ సీవీటీ ఆటోమెటిక్‌గా ఈ మాడల్‌ను రూపొందించింది.

హ్యుందాయ్ అల్కాజర్ నయా..

అల్కాజర్‌లో నయా మాడల్‌ను మార్కెట్లోకి విడుదల చేయడానికి సిద్ధమైంది హ్యుందాయ్ మోటర్. ఈ నెల చివర్లో అందుబాటులోకి రానున్న ఈ కారు ధర రూ.17 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ మాడల్‌లో 10.25 ఇంచుల స్క్రీన్, డ్యుయల్-జోన్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, ఏడు ఎయిర్ బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి.

బీఎండబ్ల్యూ 5 సిరీస్

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ.. ఎనిమిదో జనరేషన్ 5 సిరీస్ మాడళ్లను మార్కెట్లోకి విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఈ మాడళ్లు అంతర్జాతీయ మార్కెట్లో లభ్యమవుతున్నాయి. డ్యూయల్ డిజిటల్ స్క్రీన్, 4-జోన్ క్లైమెట్ కంట్రోల్, ఏడీఏఎస్, పెట్రోల్, డీజిల్ తోపాటు హైబ్రిడ్ కూడా తయారు చేసింది.

బీఎస్ఎన్ఎల్ బాస్‌గా రాబర్ట్

న్యూఢిల్లీ, జూలై 13: ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీకే పుర్వార్ పదవి కాలాన్ని కేంద్ర ప్రభుత్వం పొడగించలేదు. దీంతో టెలికం అధికారి రాబర్ట్ జే రవికి కంపెనీ సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. 2019 జూలైలో పదవీ బాధ్యతలు స్వీకరించిన పుర్వార్.. ఐదేండ్ల పాటు విధులు నిర్వహించినప్పటికీ, పదవీకాలాన్ని పొడిగించాలని దరఖాస్తు చేసుకున్నారు. కానీ కేంద్ర సర్కార్ ఆయన ప్రతిపాదనను తిరస్కరించింది. ఇండియన్ టెలికం సర్వీసు అధికారైన రవి.. టెలికం రంగంలో 34 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది.

తెలుగు రాష్ర్టాలతో దోస్తీ..

హైదరాబాద్, జూలై 13: తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయనున్నట్లు అసోచామ్ తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ చైర్మన్ కే రవి కుమార్ రెడ్డి తెలిపారు. నూతన కమిటీ సమావేశమై..ఇరు ప్రభుత్వాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు, వృద్ధిని మరింత పరుగులు పెట్టించడానికి ఒప్పందాలు కూడా కుదుర్చుకోనున్నట్లు చెప్పారు. స్థిరత్వం, సాధికారత, వ్యవస్థాపకత, డిజిటలైజేషన్ వంటి విభాగాల్లో దూసుకుపోతున్నాయన్నారు.

పేటీఎం నుంచి సాఫ్ట్‌బ్యాంక్ ఎగ్జిట్

న్యూఢిల్లీ, జూలై 13: ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ పేటీఎం నుంచి జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ పూర్తిగా వైదొలిగింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ 150 మిలియన్ డాలర్ల నష్టం రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నది. పేటీఎంకు చెందిన మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌లో సాఫ్ట్‌బ్యాంక్ 2017 నుంచి పలుదఫాలుగా 1.5 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులుపెట్టింది. 2021లో పేటీఎంలో సాఫ్ట్‌బ్యాంక్‌కు 18.5 శాతం వాటా ఉండగా, అలాగే ఎస్‌వీఎఫ్ ఇండియా హోల్డింగ్స్ లిమిటెడ్‌కు 17.3 శాతం, ఎస్‌వీఎఫ్ ప్యాంథర్(కేమ్యాన్) లిమిటెడ్‌కు 1.2 శాతం వాటా ఉన్నది. ప్యాంథర్ లిమిటెడ్ తన పూర్తి వాటాను ఐపీవోలో భాగంగా రూ.1,689 కోట్లకు విక్రయించింది. పేటీఎం ఐపీవో పూర్తైన తర్వాత 24 నెలలకు వైదొలుగుతామని సాఫ్ట్‌బ్యాంక్ గతంలో ప్రకటించింది. దీనికి అనుగుణంగా ఇప్పుడు వైదొలిగినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి పరిస్థితులను సాఫ్ట్‌బ్యాంక్ ముందుగా ఊహించలేకపోవడం నష్టాలకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ఒక్కో షేరును రూ.800 చొప్పున సాఫ్ట్‌బ్యాంక్ కొనుగోలు చేసింది. ఇష్యూ ధర రూ.2,150 కాగా, 9 శాతం డిస్కౌంట్‌తో రూ.1,995 వద్ద పేటీఎం షేర్లు లిస్టయ్యాయి. పేటీఎం పేమెంట్ బ్యాంక్ లిమిటెడ్ లావాదేవీలను నియంత్రిస్తూ రిజర్వు బ్యాంక్ ఆదేశాలు జారీ చేయడంతో కంపెనీ షేరు ధర చారిత్రక కనిష్ఠ స్థాయి రూ.310కి పడిపోయింది. ఈ జనవరి-మార్చిలో రూ.550 కోట్ల నష్టం వచ్చింది.